# శివరావుకోట

శివరావు గొప్పమేధావి. అతను సైకోఫిజిక్స్, సైకోడైనమిక్స్ లలో చేసిన పరిశోధనలవలన ప్రపంచ శాస్త్రజ్ఞుల దృష్టి నాకర్షించాడు చిన్నవయసులోనే. అతను ఇప్పుడు 'మానవ అనుభవాన్ని నిత్యసత్యంగా మార్చడం ఎలా ?' అన్న విషయంమీద పనిచేస్తున్నాడు.

దైనందిన జీవితంలో మనిషి ఎన్నో అనుభవాలకు లోనవుతున్నాడు. అందులో చాలభాగం అర్థంలేనివీ, వ్యర్థమైనవీని. కొన్నిటిని అనుభవిస్తున్నట్లు అతనికే తెలియదు. కొన్నిటిని నెమరువేసి, సాగదీసి అనుభవిస్తాడు. కాని ఒక్కటికూడా అతనికి మిగలటంలేదు ! రుచికరమైన పదార్థాలెన్నో తింటాడు. రుచి అన్న అనుభవం ఎక్కడకు పోతుందో మరి, ఆ క్రియతోటి అదీ మాయమైపోతుంది. వాసన, సుఖము, భోగము, నవ్వు, ఏడుపు అన్నీ ఏమైపోతున్నవో ! చాల కొద్దిభాగం కొంతకాలంవరకూ జ్ఞాపకాలుగా నిలిచినా తరువాతైనా జారిపోతాయి.... తాను కోరుకున్న కొన్ని ముఖ్యమైన అనుభవాల్ని శాశ్వతం చేసుకుంటే మానవజీవితానికి పరిపూర్ణత వస్తుంది. ఆ ప్రక్రియ కనిపెడితేగాని మానవజాతికి నిజమైన మనుగడ వుండదు ! దానికోసమే శివరావు ప్రయత్నం.... బృహత్‌యత్నం !

శివరావుకు తన పరిశోధనలమీద తప్ప మిగతా ప్రపంచంలో ఆసక్తి లేదు. అనురాగాలు, అనుబంధాలు మొదలైన భావనలు అశాస్త్రీయము

లని నిర్లక్ష్యం. కాని ఈ మధ్యనే జీవితం విసిరే ఉచ్చులో చిక్కు కున్నాడు. గౌరి అనే అమ్మాయి అతన్ని బలంగా ఆకర్షిస్తోంది. ఇది యౌవనసహజమైన కామవాంఛయొక్క గ్రుడ్డిరూపాంతరమేనని అతను అనుమానించినా, యింకా ఒక నిర్ధారణకు రాలేదు.

గౌరి ఎక్కువ ఆలోచనాపటిమ గల వ్యక్తి కాదు. శాస్త్రీయమైన ఆలోచనాధోరణి ఆ పిల్లకు లేదు. పైగా శివరావు పరిశోధనలతో పాటుగా మానవప్రయత్నాలన్నిటినీ అపహాస్యం చేస్తున్నట్లు మాట్లాడు తుంది. "ఆకాశంలో స్పష్టంగా కనిపించే నక్షత్రాల సంగతలావుంచండి' కనిపించీ కనిపించని నక్షత్రాలుంటాయే అవి నేరుగా శ్రద్ధగా పరీక్షగా చూస్తే అసలు కనిపించవు. ప్రక్కగా ఎటో చూస్తున్నపుడు మరింత కాంతితో ప్రత్యక్షమౌతాయి.

"ఏదైనా విషయం గుర్తుకు తెచ్చుకోవాలనుకుంటే ఎంత ప్రయ త్నించినా గుర్తుకురాదు. ఆ ప్రయత్నం ఒదిలేసి వేరే పనిలో వున్న ప్పుడు గబుక్కున గుర్తుకు వస్తుంది."

"ప్రపంచగతినే ప్రభావితం చేసిన ఎన్నో పరిశోధనలు యిలాగే ప్రయత్నం విరమించాక సిద్ధించినవే. కాబట్టి మీరు యింత తీవ్రంగా ఆలోచించకుండా ఒదిలెయ్యండి. సమాధానం వస్తుంది" అని నవ్వుతుంది. ఎప్పుడూ నవ్వుతూ గలగల పారే సెలయేరులాగా వుంటుంది గౌరి. ఆ నవ్వు శివరావుని అతి విలువైన పనిలోనుంచీ కళ్ళెంవేసి లాక్కొస్తున్నది.

శివరావుకి 'ఎదురు చూడ్డం' అంటే సరిపడదు. అతనికి కాలం విలువైనది. కాని యివాళ గౌరికోసం ఎదురుచూస్తున్నాడు. ఊరిబయట

తోటప్రక్కన గుట్టలుండే విశాలమైన బయలు అది. గౌరికి యిలాంటి చోటులంటే యిష్టం. అందుకే యిక్కడికి రమ్మన్నది. కాని చెప్పిన ప్రకారం ఆపిల్ల రాలేదు. 'చెప్పిన ప్రకారంగా చెయ్యకపోవటమే గౌరి లక్షణం' అని నవ్వుకున్నాడు. గౌరి జ్ఞాపకాల తియ్యని మత్తులో గడ్డి మీద వెల్లకిలా పడుకున్నాడు. పనిలేక పోవడానో, పరిశ్రమ తర్వాతి అలసటవలననో క్రమంగా నిస్సత్తువలోకి, మగతలోకి జారిపోయాడు.

అప్పుడు యీ విచిత్రం జరిగింది. పడుకున్న అతని నోట్లోంచీ అప్రయత్నంగా 'సాధ్యం' అన్నమాట బయటికి వచ్చింది. ఆ మాట అతని కళ్ళముందే ఘనీభవించి రాయిగా రూపొందింది, కలా ? నిజమా ? అనుకున్నాడు. ఎదురుగా రాయివున్నది – గట్టిగా, నిజంగా. మట్టి రంగులో, తేలిగ్గా, పారదర్శకమైన దీర్ఘ ఘనం. దాన్ని చూడగానే ఏదైనా సాధ్యమేనని తెలిసిపోతున్నది. సందేహానికి తావులేదు ! కాని అతనికి భయంవేసింది. కొంత సేపటికి తేరుకున్నాడు. 'సుఖం' అన్నాడు. ఆ మాటకూడా ఘనీభవించింది. ఈసారి భయం వెయ్యలేదు. దాన్ని పట్టుకుని చూచాడు. ఎంతో సుఖమనిపించింది. గట్టిగా, పచ్చగా, నిజంగా, కాంతి నిరోధకమైన దీర్ఘ ఘనం. ఈసారి అతనికి సరదాపుట్టింది. 'చలి' అన్నాడు. బూడిదరంగు రాయి ఏర్పడింది. 'మంచితనం' తెల్లగా, తేలిగ్గా, కాంతినిరోధకంగా వున్నది. సరదాగా చాలారాళ్ళు చేశాడు. అందమైన రాళ్ళకుప్ప ఏర్పడ్డది.

తాను చేస్తున్న పనివిషయంలో అతనికింకా సందేహం పోలేదు. ఎవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూశాడు. దూరాన పచ్చని చెట్టు.

దానిక్రింద ముసలివాడు. అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లున్నాడు. ఒక్కొక్కసారి అస్థిపంజరం మాదిరిగానూ కనిపిస్తున్నాడు. శివరావునే చూస్తున్నాడు. ఆ చూపులో ఏ భావమూలేదు. తాను చేస్తున్న పనికి నవ్వినా, తిట్టినా, ఎగతాళి చేసినా శివరావుకి అర్థం అయేదే. కాని యీ భావరహితమైన చూపు అతనికి సరిపడలేదు. కాని ఏమీ చెయ్యలేక, తలత్రిప్పి రాళ్ళగుట్టను పరిశీలిస్తూ కూర్చున్నాడు. చూడగా, చూడగా రాళ్ళన్నీ ఒకేమాదిరిగా అర్థరహితంగా కన్పించసాగాయి. 'ఈ ముసలాడు నా మూడ్ పాడుచేశాడు' అని విసుక్కున్నాడు.

ఆ రాళ్ళన్నీ కూర్చి అర్థవంతమైన ఆకారం యిస్తే ఎట్లుంటుందో నన్న ఆలోచన వచ్చింది. ఒకదానిమీద నొకటి పేర్చాడు. చక్కగా అతుక్కుపోతాయి. ముసలివానికీ తనకీ మధ్యన గోడలా కడుతూ పోయాడు. కొంతసేపు కట్టి ఒక చివరకుపోయి తొంగిచూశాడు. ముసలివాడు అలానే చూస్తున్నాడు. శివరావుకి చాల కోపం వచ్చింది. అర్థం లేకపోవటాన్ని శివరావు సహించలేక పోతున్నాడు. 'ఆ చూపును భరించాల్సిన అవసరం నాకు లేదు' అనుకున్నాడు. తనచుట్టూ అనుభవాల రాతి కోట కట్టి ఆ ముసలాడు — ఆ అర్థరాహిత్యం — ఎప్పటికీ కనపడకుండా చేసుకోగలడు।

రకరకాల అనుభవాలు యిటుకలు చేస్తూ చిత్రవిచిత్రాలుగా పేరుస్తూ కోట కడుతూ పోతున్నాడు శివరావు. బాహ్యప్రపంచాన్ని మరపించేటంతటి ఆసక్తి పుట్టింది పనిలో. చుట్టూ గోడలు పైకి లేచినై.

గౌరి యిప్పటికైనా వస్తున్నదేమోనని గోడపైకి ఎక్కిచూశాడు. గౌరి రావటంలేదుగాని ముసలాడు అట్లాగే చూస్తూవున్నాడు. ఈసారి శివరావుకి చాల కోపం వచ్చింది. 'ఈ అస్థిపంజరాన్ని చూడకూడదు!' అనుకుని కోటపైనంతా శుద్ధంగా మూసేశాడు. అందమైన కోటలో కూర్చున్నాడు. ఇహనుండీ బయటి క్షుద్రప్రపంచంతో సంబంధం లేకుండా, తన పరిశోధనలు తాను చేసుకుంటూ హాయిగా వుండొచ్చు తన సొంత కోటలో! అనుకున్నాడు.

వాకిలిగా వదలిన సందులోనుంచీ గౌరి కనిపించింది. గబగబా నడిచివస్తోంది. తన ఆలస్యానికి క్షమాపణలు చెప్పుకుంటున్నట్లుగా వేగంగా వస్తోంది.

గౌరిని చూస్తున్న శివరావు కళ్ళకి గౌరి వెనుగ్గా చెట్టుక్రింది ముసలాడు కన్పించాడు. ఇద్దరూ ఒకటిగా కన్పించారు. తల విదిలించుకున్నా భ్రాంతి ఒదల్లేదు.

అప్పుడు శివరావుకి అనుమానం వచ్చింది. ఈ గౌరి కోటలోకి ఒస్తుందా? ఆ చెట్టుక్రింద ముసలాడిదగ్గర హాయిగా వుందామంటుంది!

శివరావులో గౌరి వస్తున్నదన్న సంతోషం పోయింది. ఇప్పుడు గౌరి అతనికళ్ళకు అనంతమైన అజ్ఞానానికి ప్రతినిధిలాగా ఉబ్బుగా కనిపించింది. మానవజాతి పోరాడి గెలవ్వలసిన చీకటికి మూర్తిలాగా నల్లగా కనిపించింది. వంకరటింకరగా నడుస్తూ కనిపించింది.

ఇటువంటి మనిషిమీద నాకు యింత ఆకర్షణ ఎట్లా కలిగిందని ఆశ్చర్యపోయాడు శివరావు. ఆలోచించిన కొద్దీ అతని ఆశ్చర్యం అస

హ్యంగా మారింది. గౌరిమీద అసహ్యం. తనమీద అసహ్యం. ప్రేమ మీద అసహ్యం !....తాను పెద్ద మేధావి. ప్రపంచ స్థాయి కీర్తి సంపాదించబోతున్నవాడు. ఈ పల్లెపిల్ల వలలో ఎట్లా చిక్కుబడ్డాడు ! ఆహా! ఎంత నెరజాణలుంటారు పల్లెసీమల్లో ! నేనా వీళ్ళ వలలో చిక్కే అమాయకుణ్ణి ! అని నవ్వుకున్నాడు.

ఇహ ఆ గౌరి లోపలకు రాకూడదు. ఆ వాకిలికూడా మూసేస్తేనే గాని తనకు శాంతి లేదు ! ఇంతవరకూ రాతిగా మార్చని ఒక్కమాట కోసం, ఒక్కభావంకోసం తన అంతరాంతరాల్లో గాలించాడు. 'ప్రేమ' అన్నాడు. వెంటనే అమాట బయటికివచ్చి, ఘనీభవిస్తుండగానే విరిగి విసుగు, కోపం, భయం, అసహ్యం అయి వాకిట్లో కుప్పబడిపోయింది. ఇప్పుడు వాకిలే లేదు !

అసలు వాకిలితో — ప్రపంచంతో — పనిలేదు ! కోటలో శివరావు సంతోషంగా వున్నాడు. అనుభవాల్ని నిత్యసత్యంగా మార్చే ప్రక్రియ అతనికి తెలిసిపోయింది. ఎంత శ్రమకు ఫలితం యిది ! తన అనుభవాలన్నీ శిలాశాశ్వతాలై పోయాయి ! తనకు పూర్ణత్వం సిద్ధించింది. ఇది కేవలం తన కోట !

కొంతసేపటికి అతనికి ఊపిరాడనట్లు, ఉక్కిరిబిక్కిరౌతున్నట్లు, శరీరం బిగుసుకుపోతున్నట్లు అనిపించింది.

గాలి....గాలి ...ప్రాణవాయువు లేదు !

క్షణక్షణానికీ అతని శక్తి క్షీణించిపోతున్నది. క్రిందపడిపోయాడు శివరావు.

గుట్టమీదవున్న మనిషి ఎప్పట్నుండో శివరావు వింతచేష్టల్ని గమనిస్తున్నాడు. ఆలోచనలోపడ్డట్లు, చేతిలో ఏమోవున్నట్లు, ఏదో పనిచేస్తున్నట్లు శివరావు చేస్తున్న చేష్టల్ని చోద్యంగా చూశాడు. ఇంతలోనే శివరావు పడిపోయాడు. అతను గుట్ట దిగి శివరావు దగ్గరకెళ్ళి చూశాడు. శ్వాస నిలిచిపోయింది....

'ఉత్తినే యిట్లా చచ్చాడేమిటి?' అనుకుంటూ నిలబడిపోయాడతను.

శ్రీ రత్నా ప్రింటర్స్, ముత్తంగివారి వీధి, రాజమండ్రి - 1.